# ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమీక్ష

**కడప,మే 18 ప్రభాతవార్త :**

కడప జిల్లా రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా DPMU కార్యాలయంలో రాజంపేట డివిజన్ ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్వీ ప్రవీణ్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇటీవల రాజంపేట, సుండుపల్లి, నందనూరు, వీరబల్లి మండలాలు కడప జిల్లాలో చేర్చబడిన నేపథ్యంలో, ఆయా మండలాల ప్రకృతి వ్యవసాయ సిబ్బందిని అధికారికంగా జిల్లా పరిధిలోకి చేర్చుకుని వారితో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్వీ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ... ప్రస్తుత ఎల్‌నినో ప్రభావం కారణంగా రైతులకు అందించాల్సిన శిక్షణా కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని తెలిపారు. వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.ప్రత్యేకంగా 365 రోజుల పాటు భూమి కప్పబడి ఉండే విధంగా వివిధ పంటలను సాగు చేయాలని సూచించారు. అలాగే ప్రీమాన్సూన్ డ్రై సోయింగ్ విధానాన్ని ప్రోత్సహిస్తూ, విత్తనాలను విత్తన గుళికలుగా మార్చి విత్తడం ద్వారా మొలక శాతం మెరుగుపడటంతో పాటు తక్కువ నీటి పరిస్థితుల్లో కూడా పంటలు బాగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని వివరించారు.రైతులకు అవసరమైన ఘన జీవామృతం, PMDS సీడ్ కిట్లు, పంటలకు సంబంధించిన పురుగులు మరియు తెగుళ్ల నివారణ ద్రావణాలు బయో రిసోర్స్ సెంటర్లలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు అవసరమైన ప్రకృతి వ్యవసాయ సేవలు సమయానికి అందించడంలో సిబ్బంది చురుకుగా వ్యవహరించాలని ఆయన కోరారు.


వైఎస్ఆర్

# కడప వార్త



తెలుగు జాతీయ దినపత్రిక

మంగళవారం 19 మే 2026


## అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

**దువ్వూరు, మే 18, ప్రభాతవార్త:**



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని మండల తహసిల్దార్ సంజీవరెడ్డి, ఎంపీడీవో సుబ్బారెడ్డిలు అన్నారు. సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గ్రామాల నుండి వచ్చిన ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ఎక్కువగా రీ సర్వే జరిగే గ్రామాల్లో భూముల సమస్యలు అంటే అలాగే మంచినీటి సమస్య తదితర వాటిపై వినతి స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులకు పంపుతామని వాటిని నిర్ణీత గడువు లోగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ కుమార్, మండల విద్యాశాఖ అధికారి రమణ, ఏపీఓ లక్ష్మి నారాయణ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్ సమస్యలను సత్వరమే పరిష్కరించండి

**కడప,మే 18 ప్రభాతవార్త :**

అర్జీదారులకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించి.. ప్రజా సమస్యలను 0కి తీసుకురావడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జిల్లా రెవెన్యూ అధికారి మల్లిఖార్జునుడు పేర్కొన్నారు. సోమ వారం కలెక్టరేట్ లోని సభా భవన్ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అధికారితో పాటు పలువురు జిల్లా స్థాయి అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పిజిఆర్ఎస్ వ్యవస్థ ద్వారా అర్జీదారులకు సంతృప్తి కరమైన, నాణ్యమైన వేగవంతమైన పరిష్కారాన్ని అందిస్తోందన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా జిల్లా స్థాయి నుండి మండల స్థాయి వరకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. వేసవిలో అర్జీదారుల ప్రజల వ్యయ ప్రయాసలను దృష్టిలో ఉంచుకుని.. క్షేత్ర స్థాయిలో సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించేలా ప్రత్యేక దృష్టి సారించాలని.. జిల్లా అధికారులకు సూచించారు. ముఖ్యంగా ప్రజల వ్యయ ప్రయాసలను దృష్టిలో ఉంచుకుని క్షేత్ర స్థాయిలోనే ప్రజల సమస్యలను స్థానికంగానే గుర్తించి మండల స్థాయిలోనే పరిష్కరించేలా జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా భూ సంబంధిత సమస్యలను.పరిష్కరించుకోవాలన్నారు.



శివాలయంలో ఆభరణాలు, నగదు మాయం చేసిన వారిపై

# చర్యలు తీసుకోవాలి



**ప్రొద్దుటూరు మే 18 ప్రభాతవార్త**

ప్రొద్దుటూరు అగస్తేశ్వరాలయంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ వేగంగా పూర్తి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని దేవాలయాల సంరక్షణ సమితి, విశ్వ హిందూ పరిషత్, శివ శక్తి, గో సంరక్షణ సమితి, బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఈ విషయమై వారు స్థానిక శ్రీ కృష్ణాలయం నుండి శివాలయం వరకు ర్యాలీ నిర్వహించి శివాలయం దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆభరణాలు, నగదు వెంటనే రికవరీ చేయాలని నినాదాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ పట్టణంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ అగస్తేశ్వరాలయంలో అమ్మవారి బంగారు ఆభరణాలతో పాటు వెండి నగలు, కోటి రూపాయల నగదు మాయమైన సంఘటనలో ఎండోమెంట్ అధికారులు దోషులను గుర్తించి, చర్యలు చేపట్టే విషయంలో కాలయాపన చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గతంలో ఈఓలుగా పని చేసిన హయాంలో ఈ అక్రమాలు జరిగాయని ప్రస్తుత ఆలయ ఛైర్మన్, పూజారులతో పాటు భక్తులందరూ చేస్తున్న ఆరోపణలను ప్రొద్దుటూరు శాసన సభ్యులు నంద్యాల వరదరాజులరెడ్డి స్వయంగా మంత్రి దృష్టికి తీసుకువెళ్లారని, దీంతో మంత్రి ఆదేశాల మేరకు విచారణ కమిటీ పొద్దుటూరుకు శివాలయంలో విచారణ చేపట్టడం జరిగిందని వివరించారు. కానీ ప్రస్తుత ఆలయ ఈఓ మరియు గుమస్తా విచారణకు సహకరించని కారణంగా విచారణను అర్ధాంతరంగా ఆపినట్లు భక్తులకు చెబుతున్నారని తెలిపారు. అయితే విజారణ జరిగిన తీరును బట్టి ఎండోమెంట్ శాఖ అధికారులు కంటి తుడుపు చర్యగా, నామమాత్రపు విచారణ జరిపి చేతులు దులుపుకోవాలని చూస్తున్నారని స్పష్టం అవుతోందన్నారు. భక్తుల మనోభావాలను గౌరవించడంతో పాటు శివాలయం లో జరిగిన అక్రమాలను తీవ్రంగా పరిగణించి సమగ్ర విచారణ జరిపించి, కఠిన మైన చర్యలు తీసుకోవడం ద్వారా ఇటువంటి అక్రమాలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయాల సంరక్షణ అధ్యక్షులు పుష్పాల శ్రీనాథ్ రెడ్డి, విశ్వహిందూ పరిషత్ నాయకులు మల్లికార్జునరావు, శివశక్తి నాయకులు పుల్లారెడ్డి, గో సంరక్షణ సమితి నాయకులు శివనాగిరెడ్డి బిజెపి నాయకులు ప్రదీప్ కుమార్ రెడ్డి, నరేంద్రరావు, పాలెం కిరణ్, మురళీధర్ రెడ్డి, జనసేన నాయకులు మాదాసు మురళీ మరియు హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ధరల పెంపుతో ప్రజల నడ్డి విరుస్తున్న కూటమి ప్రభుత్వం

**ఆకాశాన్ని అంటిన ఎరువుల, నిత్యవసరల వస్తువుల ధరలు**

**మేనిఫెస్టో వాగ్దానాలను తుంగలో తొక్కిన అధికార ప్రభుత్వం**

**రెడ్ బుక్ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ఎదురుచూస్తున్న ప్రజలు**

**ప్రజాపాలన అందించ డంలో బోల్తాపడ్డ డబుల్ ఇంజన్ సర్కార్**

**ఇంధన ధరల పెంపుపై వైసీపీ ఆందోళనలో నేతలు**

**పులివెందుల మే 18 ప్రభాతవార్త :**

కూటమి ప్రభుత్వం పెట్రోల్ డీజిల్, ఎరువులు, నిత్యావ సర సరుకుల ధరలు పెంచి ప్రజల నడ్డి విరుస్తోందని సామాన్యుడు కొనలేని విధంగా ధరలు ఆకాశాన్ని అంటాయని మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కిందని ప్రజాపాలన అందించడంలో డబ్బులు ఇంజన్ సర్కార్ బోల్తా పడిందని రెడ్ బుక్ రాజ్యాంగ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారని వైసీపీ నేతలు వైయస్ మనోహర్ రెడ్డి, దుష్యంత రెడ్డి, గూడూరు చిన్నప్ప నాగేళ్ల సాంబశివారెడ్డి తదితరులు అన్నారు. వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడంపై నిరసన వ్యక్తం చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం పులివెందులలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని వైసీపీ కార్యాలయం నుంచి ప్రధాన రోడ్ల మీదుగా బొలెరో వాహనాన్ని తాళ్లతో లాగుతూ మినీ సెక్రటేరియట్ కు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పులివెందుల ప్రధాన రహదారులన్నీ వైసీపీ జెండాలతో రెపరెపలాడాయి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైసిపి నాయకుల కార్యకర్తలు నినాదాలతో ప్రధాన రోడ్లు మారు మ్రోగాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై అదనపు భారం మోపడం అన్యాయమన్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఇంధన ధరల పెంపు మరింత భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను ఉపసంహరిం చుకోవాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్లో పెట్రోల్ ధరలు తగ్గించే ప్రజలకు ఉపశమనం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అరాచక రెడ్బుక్ రాజ్యాంగ పాలనను ప్రజల అసహ్యించుకుంటున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం బుద్ధి తెచ్చుకుని ధరల పెంపును ఉపసంహరించుకొని ప్రజా సంక్షేమ పాలనను అందించాలని లేకపోతే ప్రజలు గద్ద దించేందుకు ఎదురుచూస్తూ ఉన్నారన్నారు. అనంతరం ఆర్టీవో చిన్నయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇన్చార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి, దుష్యంతరెడ్డి, తొండూరు మండల ఇన్చార్జ్ మదన్ మోహన్ రెడ్డి, యువ నాయకులు దుర్గాప్రసాద్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చెన్నప్ప, మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, హాలు గంగాధర్ రెడ్డి, నాగేళ్ల సాంబశివారెడ్డి, ఓతూరు రసూల్, మాజీ కౌన్సిలర్లు , ఎంపీటీసీలు, సర్పంచులు, మండల నాయకులు కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నేతలు కార్యకర్తలు తదితరులు



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న వైసీపీ నేతలు

# కడప నగర పునర్విభజన వివరాల విడుదల



**కడప కార్పొరేషన్ మే18 ప్రభాతవార్త:**

కడప నగరపాలక సంస్థ పరిధిలో ప్రస్తుతం ఉన్న 50 డివిజన్లను 66 డివిజన్లుగా డీలిమిటేషన్ (పునర్విభజన) చేయుటకు సంబంధించిన ప్రతిపాదనలు, పూర్తి వివరాలు, మ్యాపులను నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎస్. భావన, ఐఏఎస్ విడుదల చేశారు. ఈ డీలిమిటేషన్ ప్రక్రియలో భాగంగా ప్రతి డివిజన్ పరిధి, జనాభా, భౌగోళిక పరిస్థితులు, పరిపాలనా సౌలభ్యాలను పరిగణనలోకి తీసుకొని ప్రతిపాదనలు రూపొందించబడినట్లు తెలిపారు. ప్రజలు విడుదల చేసిన మ్యాపులు, వివరాలను పరిశీలించి, ఏవైనా అభ్యంతరాలు లేదా సూచనలు ఉన్నట్లయితే మే18 నుండి మే 24 వరకు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెల్‌లో లిఖితపూర్వకంగా సమర్పించవచ్చని తెలిపారు. ప్రజల నుండి అందిన అభ్యంతరాలు, సూచనలను పరిశీలించిన అనంతరం తుది ప్రతిపాదనలు సిద్ధం చేయబడతాయని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కూచిపూడి రాకేష్ చంద్ర, సిటీ ప్లానర్ శైలజ, ఏసిపి లు మునిరత్నం, ముని లక్ష్మి, టిపిఓ రత్నరాజు పాల్గొన్నారు.

# భారీ అగ్నిప్రమాదంలో దుకాణాలు దగ్ధం

**సంఘటన స్థలాన్ని పరిశీలించిన జగన్ మోహన్ రాజు**



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న జగన్మోహన్ రాజు

**రాజంపేట, మే 18 ప్రభాతవార్త**

రాజంపేట పట్టణం మన్నూరు మసీదు స్మశానం వద్ద ప్రధాన రహదారిలోని పెయింట్ దుకాణాల్లో సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో భారీ ఆస్తి నష్టం జరిగింది. పెయింట్ దుకాణం పక్కనే వెల్డింగ్ పనులు చేస్తుండగా నిప్పురవ్వలు ఎగిసి పడడంతో పెయింట్ షాపులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. పక్కనే ఉన్న ఎలక్ట్రిక్ దుకాణం కూడా మంటలు వ్యాపించడంతో రెండు దుకాణాలు దగ్ధమయ్యాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికే పెయింట్ దుకాణంలో ఎలక్ట్రిక్ దుకాణంలో దాదాపు అన్ని కాలిపోయి బూడిద అయ్యాయి. లక్షలాది రూపాయల ఆస్తి నష్టం జరిగింది. ఈ సంఘటన విషయం తెలుసుకున్న వెంటనే టిడిపి ఇంచార్జ్ జగన్మోహన్ రాజు పార్టీ నాయకులతో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం తరఫున ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రమాదానికి దారి తీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అగ్ని ప్రమాదం విషయం తెలుసుకున్న తాసిల్దార్ దస్తగిరయ్య కూడా సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధితుడు జిలాని సంఘటన తిరిగిన తీరును వివరించారు.

## గిట్టుబాటు దరలేక కుదేలవుతున్న మామిడి రైతులు

**సుండుపల్లి, మే 18, ప్రభాతవార్త:**

మండలంలోని పలు గ్రామాల రైతులు మామిడి తోటలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం మామిడి కాయలు కోత దశకు చేరుకున్న సమయంలో మండలంలోని మండి వ్యాపారస్తులు ఒక్కటిగా ఏర్పడి ఒకే ధరకు కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో తీవ్ర నష్టాలు ఎదుర్కొంటూ ఉన్నామని పలువురు రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో రైతులకు న్యాయమైన గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ జనసేన పార్టీ నాయకులు రామా శ్రీనివాస్ ఆధ్వర్యంలో కడప జిల్లా కలెక్టర్ కార్యాలయంకు వినతిపత్రం అందజేశారు. మామిడి రైతుల సమస్యలను ప్రభుత్వం గుర్తించి, వ్యాపారస్తుల ధరల నియంత్రణపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు ప్రభుత్వం అండగా నిలిచి గిట్టుబాటు ధరలు అందేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.




### విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు

# విత్తన దుకాణాలపై అకస్మిక తనిఖీలు

**మైదుకూరు, మే 18, ప్రభాతవార్త:**

మైదుకూరు పట్టణ బద్వేల్ రోడ్డు నందు సీడ్స్ దుకాణంలో విజిలెన్స్ మరియు ఎన్ ఫోర్స్ మెంటు అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో భాగంగా సీడ్స్‌కి సంబంధించిన గోడౌన్ లో సరైన అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన జీలుగ మరియు పిల్లి పెసర విత్తనాలను విజిలెన్స్ అధికారులు సీజ్ చేసి షాప్ యజమాని వారిపై EC ACT 1995 ప్రకారం 6(A) కేసు నమోదు చేయడం జరిగింది.తదుపరి చర్యల నిమిత్తం మండల వ్యవసాయ అధికారి వారిని జాయింట్ కలెక్టర్ కడప కోర్టులో కేసు ఫైల్ చేయవలసింది గా తెలపడం జరిగింది.

**సీజ్ చేసిన విత్తనాలవివరాలు**

1. జీలుగ విత్తనాలు..5,100 కేజీలు, విలువ 3,57,000 రూపాయలు 2. పిల్లి పెసర విత్తనాలు 50కేజీలు, విలువ30000 మొత్తం విలువ 3,87,000/విలువగల విత్తనాలను విజిలెన్స్ మరియు ఎన్ ఫోర్స్ మెంటు అధికారులు సీజ్ చేశారు.. సరైన అనుమతులు లేకుండా ఎవరైనా అమ్మకాలు జరిపితే సదరి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ తనిఖీలలో పి శ్రీనివాసులు రెడ్డి, జి.లక్ష్మణ కుమార్, ఈ.బాలగంగాధర్ రెడ్డి, ఎస్.ఖాజా హుస్సేన్, మహమ్మద్ రఫీ, జిల్లా అధికా రులు తదితరులు పాల్గొన్నారు.











జిల్లాలోని జమ్మలమడుగు నియోజకవర్గం కొండాపురం సర్కిల్ లోని తాళ్ల ప్రొద్దుటూరు పరిధిలోని టి. కోడూరు గ్రామం వద్ద SAEL సోలార్ ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఈ నెల 22వ తేదీన మంత్రి నారా లోకేష్ బాబు పర్యటన నేపథ్యంలో చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ నిధిమీనా, టి.డి.పి కడప జిల్లా పార్లమెంట్ అధ్యక్షులు భూపేష్ రెడ్డి మరియు జమ్మలమడుగు డి. ఎస్పీ శ్రీ కె. వెంకటేశ్వర రావు RDO, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### క్షయ వ్యాధి గ్రస్తులకు
## X-ray ద్వారా ఉచిత పరీక్షలు..




**సుండుపల్లె, మే 18, ప్రభాతవార్త :**
రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నందు ఉచిత టి బి X-ray కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని డాక్టర్ శేఖర్ రెడ్డి,డాక్టర్ రుబీన లు తెలియ జేసారు. పిహెచ్సి పరిధిలోని ప్రజలందరికి టిబి నిర్ధారణ పరీక్షలు రాయచోటి టీబీ యూనిట్ ద్వారా దాదాపు 130 మందికి x-ray పరీక్షలు నిర్వహించడం జరిగిందని వారుతెలిపారు. క్షయ వ్యాధి బీపీ,షుగర్, స్మోకర్స్ డింకర్స్ కు క్షయ వ్యాధి ఎక్కువగా ఉంటుందని వ్యాధి గ్రస్తులు ఉన్న ఇంటి లోని వారికీ, క్షయ వ్యాధిగ్రస్తులు ఉన్న చుట్టూ పక్కల వారికీ వచ్చే అవకాశం ఉందని కావున పై లక్షణాలు ఉన్న వారు అందరు ముందు జాగ్రత్తగా పరీక్షలు చేసుకుంటే జబ్బు నిర్ధారణ అయితే 6నెల పాటు మందులు వాడితో పూర్తిగా నయము అవుతుం దని వారు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వీరనారాయణ, నగేష్, ఫీల్డ్ కో ఆర్డినేటర్ మనికంట, సిహెచ్ఒలు, ఎఎన్ఎంలు, ఆశాస్ పాల్గొన్నారు.

## కూలీలకు చల్లటి పానీయాలు పంపకం



**ఒంటిమిట్ట మే 18 ప్రభాతవార్త**
వేసవికాలం ఉష్ణ ప్రభావం దృష్టిలో ఉంచుకొని ఉపాధి కూలీలకు సోమవారం ఒంటిమిట్ట చెరువు సంఘం అధ్యక్షుడు పాటలు గంగిరెడ్డి. చల్లటి పానీయాలు పంపకం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంటిమిట్ట చెరువు కింద జల హారతి జలధర పనులు నిర్వహిస్తున్న సుమారుగా 100 మంది ఉపాధి కూలీలకు అధిక ఉష్ణ ప్రభావం దృష్టిలో పెట్టుకొని సొమ్మసిల్ల కుండా ఉపశమనం కలిగించేందుకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కూల్ డ్రింక్స్ను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో మంచినీరు టోపీ రుమాల్ కచ్చితంగా ఉపయోగించాలని ఉపాధి కూలీలకు ఆయన తగిన విధంగా సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది.

## రోడ్డు ప్రమాదంలో మృతి

**వేంపల్లి మే 18 ప్రభాతవార్త**



చక్రాయపేట మండలం లోని కొండప్పగారిపల్లి బ్రిడ్జి సమీపంలో అదుపుతప్పి ద్విచక్ర వాహనం ప్రమాదానికి గురైంది. సోమవారం తెల్లవారుజామున రాయచోటి నుండి పులివెందులకు వెళ్లుతుండగా ప్రమాదం జరగడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు పులివెందులోని నగరిగుట్టకు చెందిన బుక్కే మహేష్ నాయక్, కల్లా దీపిక మృత్యువాత పడ్డారు. బుక్కే మహేష్ నాయక్ వేంపల్లిలోనీ శ్రీరామ్ నగర్లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు, ప్రమాద ఘటనా స్థలానికి చేరుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. శవపరీక్షల కోసం మృతులను వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## సేవే సంకల్పంగా ముందుకు

**ప్రొద్దుటూరు అర్బన్, మే 18 ప్రభాతవార్త**




స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నందు వేంకట సుబ్బారాయుడు 45 సం" మరణించగా అంతిమ సంస్కరణలు చేయడానికి బంధువులు ఎవరు ముందుకు రాకపోవడంతో హాస్పిటల్ సిబ్బంది ఫోన్ ద్వారా మేఐహెల్ప్యు ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ సుబహాన్ను సంప్రదించగా వారు స్పందించి సోమవారం హిందు స్మశాన వాటికలో సంప్రదాయం ప్రకారంగా అంతిమ సంస్కరణలు నిర్వహించారు. ఇటువంటి గొప్ప కార్యక్రమానికి చేయూత అందించిన ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు, టౌన్ ప్రెసిడెంట్ సుబహాన్,అహమ్మద్ హుస్సేన్, అశోక్ కుమార్, దస్తగిరి పాల్గొని అంత్యక్రియలను పూర్తి చేశారు.

## పచ్చిరొట్టె ఎరువుల విత్తనాలు మంజూరు



**సిద్దవటం మే 18 ప్రభాతవార్త**
సిద్ధవటం మండలానికి వంద క్వింటాలు పచ్చిరొట్టె ఎరువులు విత్తనాలు జీలుగలు మంజూరయ్యాయని వ్యవసాయ విస్తరణ అధికారి వై. ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ సిద్ధవటం మండలంలోని రైతులు గతవారం పచ్చిరొట్టె ఎరువుల విత్తనాల మంజూరు కొరకు వ్యవసాయ అధికారి కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు విత్తనాలను మంజూరు చేస్తున్నామన్నారు. ఒక కిలో విత్తనాల పూర్తి ధర రూ. 160 అయితే 50 శాతం సబ్సిడీతో రూ. 80 కే విత్తనాలు పంపిణీ చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## బంగారు కొనద్దని చెప్పడం దుర్భష్టకరం..

**ప్రొద్దుటూరు క్రైం, మే 18, ప్రభాతవార్త:**
కేంద్ర ప్రభుత్వం ఏడాది కాలం పాటు బంగారు కొనద్దని చెప్పడం దురదృష్టకరమని స్వర్ణకార సంఘం అధ్యక్షులు ఇలియాస్, ప్రధాన కార్యదర్శి బాల వీరయ్యలు బాధను వ్యక్తం చేశారు. ఏపీ రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షులు బ్రహ్మశ్రీ కర్రి వేణుమాదవ్ పిలుపు మేరకు ది ప్రొద్దుటూరు తాలూకా స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం బంద్కు పిలుపునివ్వడం జరిగిందని కావునా బాధ్యతలు నిర్వహిస్తున్న సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంఘీలు బంద్ను పాటిస్తూ నిరసన తెలియజేస్తూ స్థానిక ఎమ్మెల్యేని కలిసి మన వృత్తిలో కలుగుతున్న బాధలను మనం ఎదుర్కొను సమస్యలను తెలియజేసేందుకు ప్రభుత్వం వారి దృష్టికి తీసుకెళ్లి మెమెరాండం అందించుటకు మనందరం ఏకీకృతమై స్థానిక స్వర్ణకార సంఘం భవనంలో ఉదయం 9 గంటలకు సమూహమై కార్యక్రమం నందు పెద్ద సంఖ్యలో పాల్గొని బంద్ను జయప్రదం చేయాల్సిందిగా ఇలియాస్ బాషా, బాల వీరయ్యలు కోరారు.

# మరోసారి వాయిదా పడ్డ సర్వసభ్య సమావేశం

### ఎంపిపి సంతకం చేస్తేనే సమావేశానికి హాజరు అవుతాం

**సిద్దవటం మే 18 ప్రభాతవార్త**
ఎంపీపీ సంతకం చేస్తేనే తాము మండల సర్వసభ్య సమావేశానికి హాజరవుతామని కోరం ఉన్నప్పటికీ ఎంపీటీసీ సభ్యులు మండల సర్వసభ్య సమావేశానికి బాయ్ కాట్ చేశారు. మండలకేంద్రమైన సిద్దవటం ఎంపీపీ జ్యోతి వెంకటమ్మ అధ్యక్షతన సోమవారం జరగాల్సిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీటీసీ సభ్యులు బాయ్ కాట్ చేయడంతో మరోసారి వాయిదా పడింది. ఈ సందర్భంగా మాచుపల్లి ఎంపీటీసీ సభ్యులు నారపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మాధవరం1 ఎంపీటీసీ సభ్యులు దేరంగుల శివయ్య, టక్కోలు ఎంపీటీసీ సభ్యులు నేలటూరి వెంకట సుబ్బమ్మ, బొగ్గిడివారి పల్లి ఎంపీటీసీ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డిలు హాజరయ్యారు. అయితే తాము సమావేశంలో పాల్గొనాలంటే మొదట ఎంపీపీ చేత సంతకం చేయించాలని ఎంపీటీసీ సభ్యులు ఎంపీడీఓకు తెలిపారు. ఎంపీపీ మానసిక స్థితి సరిగా లేదని ఎంపీపీ సంతకం కూడా చేయలేని స్థితిలో ఉందని కావాలంటే పి. కొత్తపల్లి వైద్యాధికారిణి డాక్టర్ రంగలక్ష్మిని అడగాలని ఎంపీటీసీ సభ్యులు దేరంగుల శివయ్య అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ విషయంపై కొత్తపల్లి వైద్యాధికారిణి డాక్టర్ రంగలక్ష్మి స్పందిస్తూ సమావేశానికి ఆమె ఆరోగ్యం సహకరించదని తెలిపారు. దీంతో ఎంపీటీసీ సభ్యులందరూ మండల సర్వసభ్య సమావేశం నుంచి బయటికి వెళ్చేశారు. అనంతరం ఎంపీడీఓ ఫణిరాజ కుమారి మాట్లాడుతూ కోరం లేకపోవడంతో మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేయడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని జెడ్పీ సీఈఓ దృష్టికి తీసుకెళ్లి మళ్ళీ సమావేశం ఎప్పుడు నిర్వహించాలో అడిగి సమావేశం తేదీని ఎంపీటీసీ సభ్యులకు తెలియజేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ మాధవిలత, పి కొత్తపల్లి వైద్యాధికారి డాక్టర్ రంగలక్ష్మి ఎంఈఓ 2 అరుణ డిప్యూటీ ఎంపీడీవో, రవి వర్మ, మండల విస్తరణ అధికారి మెహతాబ్ యాస్మిన్, విద్యుత్ శాఖ ఏఈ జయచంద్ర, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ గురు ప్రసాద్ పంచాయతీరాజ్ ఏఈ నాగరాజు ఏవో సోమశేఖర్ ఎంపీడీవో రవివర్మ, ఏపీఓ నరసింహులు, హౌసింగ్ఏఈ చెన్నయ్య, అంగన్వాడి సూపర్వైజర్లు అతికారి వరలక్ష్మి, శ్రీ విద్య, ఏఈఓ ప్రభాకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ఏఎస్ఐ సుబ్బరామచంద్ర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




# ట్రాఫిక్ సీఐగా జి. ప్రసాద్ రావు

### ప్రజలకు మెరుగైన ట్రాఫిక్ సేవలందిస్తానంటున్న సీఐ

**పులివెందుల, మే 18, ప్రభాతవార్త :**



పులివెందుల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ)గా నియమితులైన జి. ప్రసాద్ రావు సోమవారం అధికారికంగా విధుల్లో చేరి బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లా కేంద్రంలో ఇటీవల చోటుచేసుకున్న ముస్లింహిందూ ఘర్షణ ఘటనలో నిర్లక్ష్యం వహించారనే ఆరోపణల నేపథ్యంలో జిల్లా ఎస్పీ సచికేత్ విశ్వనాథ్ పులివెందుల ట్రాఫిక్ సీఐగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.సోమవారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్కు చేరుకున్న నూతన సీఐ ప్రసాద్ రావుకు పోలీసు అధికారులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఐ జి. ప్రసాద్ రావు మాట్లాడుతూ పులివెందుల పట్టణంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రజలకు మెరుగైన ట్రాఫిక్ సేవలు అందించేందుకు కృషి చేస్తామని, రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ మరింత సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

## ఎన్ సిడి సర్వీస్ని సద్వినియోగం చేసుకోవాలి



**వేంపల్లె మే 18 ప్రభాతవార్త**
నాన్ కమ్యునికేబుల్ డిసీజెస్ (ఎన్సిడి) సర్వీస్ ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సునిత అన్నారు. సోమవారం అంతర్జాతీయ హైపర్ టెన్షన్ డే సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో సమగ్ర ఎన్సిడి సర్వీసెస్ ని ఆమె ప్రారంభించారు. అనంతరం రక్తపోటుకు గల కారణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డా.సురేష్ బాబు ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే ఎన్సిడిలో భాగంగా ఫిజియోథెరపి వైద్యురాలు డా. దీప, ప్రజలకు సేవలు అందించారు. గైనిక్, పిడియాట్రిక్, ఆర్థో, ఇఎన్టీ, ఆప్తాల్మిక్ తదితర వాటిపై ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డా. సురేష్ బాబు సూచించారు.

## సీఎం గారూ! ఇచ్చిన హామీలకే దిక్కులేదు. మళ్ళీ వేలంపాట అవసరమా?

**డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి.**

**వేంపల్లె మే 18 ప్రభాతవార్త**
ఇప్పటికే ఇచ్చిన హామీలకు దిక్కులేదు. ఈ పరిస్థితుల్లో మూడో బిడ్డ పుడితే 30,000 లు, నాలుగో బిడ్డ పుడితేరు 40,000 లు అని వేలం పాట పాడడం అవసరమా అని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ముఖ్యమంత్రిని సూటిగా ప్రశ్నించారు. సోమవారం వేంపల్లె లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చేటందుకు సూపర్ సిక్స్ హామీలు ప్రధానమని, దాదాపు రెండు సంవత్సరాలు కావస్తున్నా అందులో సగం హామీలు ఇప్పటివరకు అమలు కాలేదని తులసి రెడ్డి అన్నారు. నిరుద్యోగ భృతి కింద ప్రతి నిరుద్యోగికి నెలకు 3000 రూపాయలు ఆర్థిక సహాయం చేస్తామని సూపర్ సిక్స్ హామీల్లో చెప్పబడింది ఇంతవరకు మూడు రూపాయలు కూడా ఇవ్వలేదు. ఆడబిడ్డనిధి క్రింద 1959 సంవత్సరాల మధ్య వయసు ఉన్న ప్రతి ఆడబిడ్డకు నెలకు 1500 రూపాయలు ఆర్థిక సహాయం చేస్తామని సూపర్ సిక్స్ హామీలలో చెప్పబడింది.ఇంతవరకు అమలు కాలేదు. బీసీ,ఎస్సీ, ఎస్టీ,ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని సూపర్ సిక్స్ హామీలలో చెప్పబడింది. ఇంతవరకు అతీగతీ లేదు. రైతులు పండించిన ఏ పంటకు గిట్టుబాటు లభించడం లేదు. వ్యవసాయము గిట్టుబాటు కావడం లేదు. వ్యవసాయము దండుగ అనే పరిస్థితి వుంది. ఉద్యోగుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న విధంగా ఉండిపోయాయి. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉడికిపోతున్నారు. ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు దాదాపు 10, 600 కోట్ల రూపాయలు ఉన్నాయి. కాలేజీ యాజమాన్యాలు, విద్యార్థులు, తల్లిదండ్రులు మానసిక వేదనకు గురవుతున్నారు. దాదాపు 3 వేల కోట్ల రూపాయలు ఆరోగ్యశ్రీ బకాయిలు ఉన్నాయి. ఇచ్చిన హామీలను, పైన పేర్కొన్న సమస్యలను పరిష్కరించకుండా మూడో బిడ్డ పుడితేరు 30,000 లు,నాలుగో బిడ్డ పుడితే రు 40,000 లు అని వేలం పాట పాడడం ఏమాత్రం సమంజసం కాదు. ముఖ్యమంత్రి పునరాలోచించాలి అని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు.అమ్మకు అన్నం పెట్టని ప్రబుద్ధుడు పిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తా అన్నట్టుంది ముఖ్యమంత్రి వైఖరి అని ఎద్దేవా చేశారు.



## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



**పులివెందుల, మే 18, ప్రభాతవార్త :**
ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే తమ ధ్యేయమని పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి పేర్కొన్నారు. ఆదివారం పులివెందుల పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి వినతిపత్రాలను స్వీకరించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, పట్టణ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలను బీటెక్ రవి దృష్టికి తీసుకువచ్చారు. భూ సమస్యలు, పింఛన్లు, రేషన్ కార్డులు, ఉపాధి, తాగునీరు, రోడ్లు, విద్యుత్ తదితర అంశాలపై ప్రజలు తమ సమస్యలను వివరించారు.ప్రతి సమస్యను బీటెక్ రవి సావధానంగా విని, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి సూచనలు ఇచ్చారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే స్పందించడం నాయకుడి బాధ్యత అని, ప్రజలకు సేవ చేయడం తమ ప్రధాన లక్ష్యమని బీటెక్ రవి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

**దువ్వూరు, మే 18, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని చింతకుంట గ్రామ పంచాయతీ అరుంధతి వాడకు చెందిన చింతకుంట ఓబన్న(54) అనే వ్యక్తి ఈనెల 14వ తేదీన కడపకర్నూలు జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో ఓబన్నకు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన ఓబన్నను చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కొరకు కడపకు తరలించగా, అక్కడి నుండి స్విమ్స్ కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మరణించినట్లు ఎస్ఐ ధనుంజయుడు తెలిపారు. ఈ వ్యక్తిని 14వ తేదీన గుర్తు తెలియని వాహనం ఢీకొందని అనంతరం చికిత్స పొందుతూ తిరుపతి స్విమ్స్ లో మరణించారని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే మండల పరిధిలోని పెద్ద జొన్నవరం గ్రామంలో ఈనెల 13వ తేదీన ఎస్.వెంకట ప్రసాద్(27) అనే యువకుడు తన పొలం వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వెళుతుండగా మోటార్ సైకిల్ అదుపుతప్పి కింద పడ్డాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడ్డ అతన్ని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన చికిత్స కొరకు కర్నూల్ లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మరణించినట్లు కర్నూలు ఆసుపత్రి వర్గాల ద్వారా సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధనుంజయుడు తెలిపారు. ఈ రెండు కేసుల్లోనూ రోడ్డు ప్రమాదాల్లో గాయపడి చికిత్స పొందుతూ మరణించడం విశేషం.

### ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించుట కొరకు
## విద్యుత్ అంతరాయం
### విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కులాయప్ప

**బద్వేల్ అర్బన్ మే 18 ప్రభాతవార్త**



బద్వేల్ ప్రాంతంలో ప్రజలకు వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ఎక్కడ కూడా విద్యుత్ అంతరాయం లేకుండా మెరుగైన విద్యుత్ సేవలు అందించుట కొరకే విద్యుత్ అంతరాయం అప్పుడప్పుడు ఏర్పడుతుందని ఇందుకు ప్రజలు, వ్యాపారస్తులు, రైతులు, సహకరించాలని విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యం, కులాయప్ప, విద్యుత్ శాఖ రూరల్ ఏఈఈ శివకుమార్ అన్నారు, ఈ సందర్భంగా సోమవారం ఒక ప్రకటన ద్వారా వారు మాట్లాడుతూ 33 కేవీ పాయలకుంట ఫీడర్ లో మరమ్మత్తుల కారణంగా ఉదయం 8.00గ. ల నుండి 12.00గ0. ల వరకు గానుగపెంట,పి. పి. కుంట, శ్రీనివాసపురం సబ్ స్టేషన్ పరిధిలొ విద్యుత్ సరపరలో అంతరాయము ఉంటుందన్నారు, కావున ప్రజలు అందరూ సహకరించగలరని వారు కోరారు అనంతరం విద్యుత్ సరఫరా యధావిధిగా ఉంటుందని వారు తెలిపారు.

# చంద్రబాబు రాజకీయ జీవితం మోసపూరితం

### మాజీ ఎమ్మెల్యే వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి

**ప్రొద్దుటూరు మే 18 ప్రభాతవార్త**
ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయ జీవితం ఒక మోసపూరితమైనదని ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి మోసం చేయడమే ఆయన నైజం అని మాజీ ఎమ్మెల్యే వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు ప్రొద్దుటూరు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి నేతృత్వంలో పెంచిన పెట్రోల్ డీజల్ ధరలను వెంటనే తగ్గించాలనే డిమాండ్ చేస్తూ స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదురుగా ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముందుగా ఆటో నడుపుకుంటూ తాసిల్దార్ కార్యాలయానికి చేరిన మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆటో తోలడం గమనార్హం. అనంతరం ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో తాము ప్రజలకు మేలు చేశామని, సంక్షేమం, అభివృద్ధి అందించామని, అయినా తాము 11 సీట్లకు పరిమితమయ్యామంటే కేవలం చంద్రబాబు మోసపూరిత హామీల వలనే అన్నారు. చంద్రబాబు ఏనాడూ చెప్పింది చేయరు, చేసేది చెప్పరని విమర్శించారు. చంద్రబాబు రాజకీయ జీవితం మోసపూరితం అన్నారు. 2 సంవత్సరాల కూటమి ప్రభుత్వ పాలనలో ఏపీలో ఫీజు రీఎంబర్స్ మెంట్, ఆరోగ్యశ్రీ ఎక్కడ అని ప్రశ్నించారు. ప్రజా స్వామ్యం రెడ్ బుక్ రాజ్యాంగం వలన ఆతలాకుతలమైందని విమర్శించారు. రాష్ట్రంలో అన్ని రకాల ధరలు పెరిగాయని, కూటమి పాలనలో రాష్టానికే కరువు వచ్చిందని దుయ్యబట్టారు. తాము కేసులకు భయపడ, ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తూనే వుంటామని స్పష్టం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా పెట్రోల్, డీజల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ రాష్ట్రంలో పెరగనిది అభివృద్ధి మాత్రమే అని, ఎమ్మెల్యే ల దోపిడీ పెరిగింది, నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయని విమర్శించారు. పెట్రోల్ డీజల్ ధరలు వెంటనే తగ్గించాలని, లేని పక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని స్పష్టం చేశారు. అనంతరం ఈ విషయమై తహసీల్దార్ ఉదయ భాస్కర్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైసీపీ ఉపాధ్యక్షులు జమ్మలమడుగు నియోజకవర్గ పరిశీలకులు పోరెడ్డి నరసింహారెడ్డి శెట్టి పల్లె ప్రభాకర్ రెడ్డి మరియు మహిళా నేతలు నియోజకవర్గ వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.



## కడప జిల్లా బీసీ సెల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్గా వేముల సుబ్బరాజా

### సుబ్బరాజాను అభినందించిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

**బద్వేల్ అర్బన్, మే 18 (ప్రభాతవార్త):**
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా బీసీ సెల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్గా వేముల సుబ్బరాజా నియమితులయ్యారు. వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగింది. ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి,బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా, మున్సిపల్ మాజీ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్ రెడ్డి మరియు పలువురు ముఖ్య నాయకుల సహకారంతో సుబ్బరాజాకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కడప జిల్లా బీసీ సెల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్గా నియమితులైన వేముల సుబ్బరాజా సోమవారం బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా, మున్సిపల్ మాజీ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్ రెడ్డి,ఎంఆర్ఎఫ్ టైర్ డీలర్ గుర్రంపాటి రమణారెడ్డితో పాటు పలువురు ముఖ్య నాయకులను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు.

**పార్టీ బలోపేతానికి కృషి చేస్తా :**
ఈ సందర్భంగా వేముల సుబ్బరాజా మాట్లాడుతూ... వైఎస్సార్సీపీలో తాము చేసిన సేవలను గుర్తించి, నమ్మి ఈ పదవిని అప్పగించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధా, రాజగోపాల్ రెడ్డి మరియు ఇతర సీనియర్ నాయకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా, తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, నిరంతరం పార్టీ బలోపేతం కోసం అండగా ఉంటానని సుబ్బరాజా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.



# పవన విద్యుత్తు రంగంలో వినూత్న అడుగులు

**పెండ్లిమర్రి, మే 18, ప్రభాతవార్త:**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్తు పునరుత్పత్తిలో భాగంగా అనేక మార్గాలను ఎంచుకుంటున్నాయి. అందులో పవన విద్యుత్తు ఒక మార్గం. ఏమాత్రం కాలుష్యం జరగకుండా ఎటువంటి ప్రమాదకర పరిస్థితులు ఎదురుకాకుండా గాలిమరల ద్వారా పవన విద్యుత్తు పునరుత్పత్తి సాగుతోంది. ప్రత్యేకించి కంపెనీకి పవన విద్యుత్తు ఉత్పత్తికి అనుమతులు లభించాయి. దీంతో కంపెనీకి ఇదొక సవాలుగా మారింది. అనేక సవాళ్లను ఎదుర్కొంటు ప్రభుత్వాలు అనుమతించిన నిర్ణీత గడువులోపు పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో కంపెనీ వినూత్న అడుగులు వేస్తోంది. ప్రధానంగా గాలిమరల కోసం భూసేకరణ అత్యంత ప్రధానమైన సవాల్.. పలువురు రైతులు గాలి మరలకు భూములు ఇవ్వడం ద్వారా తమ పంటలకు ఇబ్బందిగా మారుతుందన్న అపోహల నేపథ్యంలో వారిలో అవగాహన కల్పించి అందుకు రైతుల నుంచి అనుమతులు పొందుతోంది. ఇందుకోసం ముందస్తు సర్వేలు సాగిస్తోందది. తమకు ఏ ప్రాంతంలో పనులు అప్పగించారో ఆయా ప్రాంతాల్లోని గ్రామాలపై దృష్టి సారించింది. పనులు ప్రపారంభం కాక ముందే ఆయా ప్రాంతాల్లో రైతులను చైతన్యపరచడంతో పాటు భూములు సేకరించడంలో వినూత్న తరహాలో ముందుకు సాగుతోంది. ఆయా గ్రామాల్లో ప్రత్యేక బృందాలతో సర్వేలు సాగిస్తోంది. ముఖ్యంగా గ్రామంలో రైతుల వాణి వినడం ద్వారా వారి ఆలోచనలకు అనుగుణంగా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. గ్రామ స్థాయి సర్వే రైతు హెల్ప్లైన్ ద్వారా గ్రామాల్లో రైతుల సమాచారాన్ని సేకరిస్తోంది. అభివృద్ధి సాగాలంటే ముందు చర్చల ద్వారానే మొదటి అడుగు పడుతుందన్న అభిప్రాయాన్ని బలంగా నమ్మిన సెరెంటికా కంపెనీ పలు రకాలుగా సమాచారాన్ని సేకరిస్తోంది. అధికారికంగానే కాకుండా అనధికారిక వర్గాల ద్వారా గ్రామాల్లో సమాచారం సేకరించి తాము పనులు ప్రారంభించపోయే ప్రాంతాల్లో ఎటువంటి ఆటంకాలు ఎదురుకాకుండా దూసుకువెళ్తోంది. ప్రత్యేకించి అత్యంత నిత్యావసరమైన విద్యుత్తు ఉత్పాదకత పెరిగిన నేపథ్యంలో విద్యుత్తు పునరుత్పత్తి వెనక అనేక కష్టనష్టాలుంటాయని వాటిని అధిగమించి దేశప్రగతికి అవసరమైన విద్యుత్తు ఉత్పత్తిలో సెరెంటికా ముందడుగు వేస్తోందనే చెప్పాలి.



## అత్యాచారాలపై శక్తి టీం అవగాహన కార్యక్రమం



**రాయచోటి టౌన్, మే 18, ప్రభాతవార్త :**
శక్తి టీమ్స్ కార్యక్రమాన్ని సిబ్యాల గ్రామం లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి పాల్గొనడం జరిగింది. శక్తి టీమ్స్ కార్యక్రమ అవగాహన గురించి సిబ్యాల గ్రామంలో ఏర్పాటు చేసిన మీటింగ్ నందు పోలీసు డిపార్ట్మెంట్ పాల్గొని ఈ శక్తి టీమ్స్ గురించి సిబ్యాల గ్రామ ప్రజలకి వివరించడం జరిగింది. అలాగే అనుంపల్లి రాంప్రసాద్ మాట్లాడుతూ శక్తి టీమ్స్ ఈ మధ్యకాలంలో చిన్నపిల్లల పైన, మహిళల పైన జరుగుతున్న అత్యాచారాలను దృష్టిలో పెట్టుకొని కూటమి ప్రభుత్వము శక్తి టీమ్స్ యాప్ని రూపొందించి దీనిని ప్రజలు ఉపయోగించుకోవాలని అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి సూచించారు. అలాగే సమాజంలో గంజాయి జూదము యువత జీవితాలను నాశనం చేస్తున్నాయని... అటువంటివారు మన సమాజంలో ఉన్న పోలీసు వారికి తెలియజేసి పోలీసువారికి సహాయపడాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

## తంబళ్లపల్లె విద్యుత్ శాఖ సబ్ ఇంజనీర్‌గా సందీప్



**తుంబళ్లపల్లె మే 18 ప్రభాతవార్త ః**
తంబళ్లపల్లె మండల విద్యుత్ శాఖ సబ్ ఇంజనీర్‌గా కే సందీప్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ విషయమై ఉదయం ఎఈ సురేంద్రకు నియామక పత్రం అందజేశారు. ఏఈ స్వాగతిస్తూ మండలంలో రైతులు, వినియోగదారుల సమస్యల పరిష్కారం, విద్యుత్ బిల్లులు వసూళ్ళ దృష్టి సారించి విద్యుత్ శాఖ సిబ్బంది సమన్వయంతో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సబ్ ఇంజనీర్ కు సూచించారు. సబ్ ఇంజనీర్ సందీప్ ను లైన్ ఇన్స్పెక్టర్లు భాస్కర్, నాగరాజు, లైన్మెన్ శంకర్ విద్యుత్ సిబ్బంది ఏఎల్ఎంలు ఆమీన్, శేషు, జనార్ధన్ షిఫ్ట్ ఆపరేటర్లు ప్రసాద్, సురేంద్ర, రాజశేఖర్, అనంత్, శ్రీకాంత్, ఇంతియాజ్, అహ్మద్ విద్యుత్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపి ఘన స్వాగతం పలికారు.ఎఈతో పాటు సిబ్బందికి కృతజ్ఞతలు తెలుపుతూ అందరి సహకారంతో మండలంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## ఆర్టీసి ఉద్యోగుల శ్రేయస్సుకు ఎన్ఎంయుఏ కృషి

### కడప జోనల్ అధ్యక్షులు వినోద్‌బాబు



**మదనపల్లె, మే 18 ప్రభాతవార్త :**
ఆర్టీసి ఉద్యోగుల శ్రేయస్సుకు ఎన్ఎంయుఏ నిరంతరం కృషి చేస్తుందని, ఉద్యోగులకు న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని కడప జోనల్ అధ్యక్షులు పి.వినోద్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం పి.మునిక్రిష్ణయ్య, రీజనల్ కార్యదర్శి అన్నమయ్య పివి.చలపతి, డిపో అధ్యక్షులు సిఎస్.రాజు, డిపో అసైన్‌టింట్ సెక్రటరీ, వన్ డిపో సెక్రటరీ రెడ్డప్పలతో కలసి ఆయన పలు సమస్యలపై మాట్లాడారు. విద్యుత్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్టీసి సిబ్బందిచేత నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. శ్రీశక్తి బస్సులలో జీరో టికెట్లు ఇచ్చే విధానాన్ని నిలుపుదల చేసి మిగతా వారికి టికెట్లు ఇచ్చే విధంగా చర్యలు తీసుకొని పరిభారాన్ని తగ్గించాలన్నారు. పిఆర్‌సి కమిటీని నియమించి ఐఆర్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 4డిఏల ఎన్‌టార్స్‌మెంటును వెంటనే చెల్లించాలన్నారు. కొత్త బస్సులను కొనుగోలు చేసి సిబ్బందిని నియమించాలన్నారు.

## కనగాని గ్రామంలో శ్రీవీరాంజనేయ స్వామి తిరుణాల్లు ఘనంగా ఉట్లోత్సవం



**రామసముద్రం మే 18 ప్రభాతవార్త**
మండల కేంద్రంలోని చొక్కాండ్లపల్లె గ్రామపంచాయతీ కనగాని గ్రామసమీపంలో కొలువైన శ్రీవీరాంజనేయ స్వామి తిరుణాలు ఉట్లోత్సవం సోమవారం గ్రామస్థులు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. తిరుణాలు సందర్భంగా ఆలయం వద్ద విద్యుత్ దీపాలంకరణ పచ్చని తోరణాలు కట్టి పలు రకాల పుష్పాలతో అలంకరణ చేశారు. శ్రీ వీరాంజనేయ స్వామి వారికి సోమవారం ఉదయం ఆలయ అర్చకులు అచ్యుత రావు, శివాశర్మ ఆలయాన్ని శుద్ధి చేసి స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్పాలతో స్వామిని అలంకరించారు, స్వామి వారిని భక్తులకు దర్శనం బాగ్యం కల్పించి తీర్థ ప్రసాధాలు అందజేశారు. అలాగే ఆలయం వద్ద కనులు పాండువగా ఉట్లోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సాహం తిలకించడానికి చుట్టు పక్కల గ్రామాల నుండి కాక బెంగళూరు నుండి భక్తులు తరలివచ్చారు. ఆలయం వద్ద గ్రామస్థులు ఆధ్వర్యంలో అన్నసంతర్పణ నిర్వహించారు, ఈ తిరుణాలు వేడుకల్లో పాల్గొన్న వైసీపీ పార్టీ స్టేట్ బిసి జనరల్ సెక్రటరీ గెవన్న,పాపి రెడ్డి నందకిషోర్ రెడ్డి, రెడ్డి వారి సోమశేఖర్ రెడ్డి, రాజారెడ్డి,సల్లా సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక పూజలందుకొన్న అగ్రహారం వేణుగోపాలస్వామి



**చౌడేపల్లి, మే 18 ప్రభాతవార్త**
మండలంలోని ఎ.కొత్తకోట పంచాయతీ అగ్రహారంలో గల రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయం లో ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రధానార్చకుడు ఆనందా చార్యుల ఆధ్వర్యంలో ఉద యాన్నే స్వామి అమ్మవార్లకు విశేషాభిషేకం, అలంకరణ గావించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ రూపాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వారందరికీ అర్చకుడు పవిత్ర తీర్ధ ప్రసాదాలందించాడు.

# పాత ఉపాధి చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలి

### ఉపాధి పని ప్రదేశాల పర్యటనలో వ్య.కా.స జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్ కుమార్



**చిన్నమండెం, మే 18, ప్రభాతవార్త:**
ఉపాధి హామీ పథకం ద్వారా చేస్తున్న పనుల సందర్శనలో భాగంగా, చిన్నమండెం మండలం, బోనమల గ్రామంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (ఏ.ఐ.ఏ.డబ్ల్యు.యు) అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్ కుమార్ నేతృత్వంలో ఉపాధి పని జరుగుతున్న ప్రదేశాలలో పర్యటించి, కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలతో సమావేశమై ఆయన మాట్లాడుతూ, ఇదివరకు వేసవికాలంలో మంచినీళ్లు, మజ్జిగ, చలువ పందిళ్ళు వేయడం, కొత్త గడ్డపారలు ఇవ్వడం లేదా గడ్డపార్లు పదును పెట్టుకోవడానికి నిధులు మంజూరు చేయడం, వంటి సౌకర్యాలు కూలీలకు అందేవని తెలిపారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఈ సౌకర్యాలు కనుమరుగయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పనిలో గతంలో మేట్ల వ్యవస్థ విధానం ఉండేదని, వారి ద్వారా కూలీలకు పని మస్టర్, కొలతలు, కూలీ చెల్లింపులు సజావుగా సునాసాయంగా జరిగేవని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం మేట్ల వ్యవస్థను రద్దు చేయడం దుర్మార్గమని అన్నారు. ఇవన్నీ పునరుద్ధరించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉపాధి కూలీలు మాట్లాడుతూ బిల్లులు సక్రమంగా అందడం లేదని ఆరు వారాలు పనిచేస్తే రెండు వారాల బిల్లులు మాత్రమే అందాయని తెలిపారు. చట్టం ప్రకారం రోజుకు 307 రూపాయలు కూలి చెల్లించాల్సి ఉండగా, చేస్తున్న పనులకు 200 రూపాయలు కూడా పడడం లేదని తెలిపారు. ఫేస్ యాప్ అనుమతించకపోతే ఆరోజు కూలి వృధా అవుతున్నదని, పని చేసినా చేయనట్లేనని ఫేస్ యాప్ తమకు ఇబ్బందులను సృష్టిస్తున్నదని తెలిపారు. వెంకటరమణ అనే కూలీకి ఆరు రోజుల పని దినాలకు గాను ఐదు రోజుల పనికే వేతనం వేశారని, అలా ఎందుకు చేశారో తగిన కారణాలను, ఉపాధి సిబ్బంది తెలియపరచడం లేదని తెలిపారు. అదేవిధంగా అనేక దఫాలు బాలకృష్ణారెడ్డి ఉపాధి హామీ పథకం జాబ్ కార్డ్ కొరకు అధికారులను కలిసినప్పటికీ, జాబ్ కార్డు మంజూరు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు.అందుకు సుధీర్ కుమార్ స్పందిస్తూ, ఉపాధి కూలీల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, పాత ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని, దినసరి కూలి 700 రూపాయలకు పెంచాలని, పని ప్రదేశంలో మౌలిక వసతులు కల్పించాలని, పనిముట్ల మంజూరుకు ప్రత్యేక నిధిని కేటాయించి, అమలు చేయాలని, డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన గ్రామ సచివాలయాల వద్ద ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కావున మీ సమస్యల పరిష్కారం కోసం, సచివాలయాల వద్ద జరిగే ఆందోళన కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం చిన్నమండెం మండల అధ్యక్షులు వండాడి రెడ్డి సుధాకర్, నాయకులు రెడ్డి శేఖర్ ,బాబు తదితరులతోపాటు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# శ్రీ వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



**నిమ్మనపల్లె, మే 18 ప్రభాతవార్త :**
మండల కేంద్రమైన నిమ్మనపల్లె బస్టాండు ప్రాంతంలో శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయంలోని శ్రీ వెంకటేశ్వరస్వామికి సోమవారం దేవాలయ నిర్మాత,ధర్మకర్త రిటైర్డు ఎంపిడిఓ మంగళంపేట శంకరయ్య ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.ప్రత్యేక పూజలు అనంతరం శ్రీ అభయాంజనేయస్వామికి గత నాలుగు రోజులుగా బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించినందుకు మండల వాసులకు ఇక్కడ స్వచ్ఛందంగా వాలంటీర్లుగా పనిచేసిన దైవ కార్యక్రమంలో పాల్గొన్న దేవాలయ సభ్యులకు, స్థానికులకు పేరుపేరునా అభినందనలు తెలిపారు. దైవ కార్యక్రమంలో పాల్గొన్న భక్తాదులకు అభయాంజనేయుడు సుఖసంతోషాలు కల్పించాలని వారికి ఘన,కనక వస్తువాహనంలో ఆ దేవదేవుడు కరుణించాలని దేవాలయ ధర్మకర్తలు కోరారు.

**ఆలయ పూర్వపుకథ :**
తమ గ్రామంలో ఎలాంటి గుడి లేదని ఓ గుడిని నిర్మిస్తే బాగుంటుందని రిటైర్డు ఎంపిడిఓ మంగళంపేట శంకరయ్య వీరి సతీమణి బయమ్మల పేరుమీద దాదాపు 10-15ఏళ్ళ క్రితం తమ సొంత నిధులతో గుడికి భూమిపూజ చేసి గుడి నిర్మాణం గావించారు. అనంతరం దాతలు కొందరు ముందుకు రావడంతో పేరుకుమాత్రం అభయాంజనేయని గుడి కాగా ఈ గుడిలో శ్రీవేంకటేశ్వరస్వామి విగ్రహం, సత్యనారాయణస్వామి విగ్రహం, అయ్యప్పస్వామి, శివలింగం, నాగదేవతల విగ్రహాలు విడివిడిగా గుళ్ళు నిర్మాంచారు. ఇదే గుడికి ప్రతిరోజూ వందల సంఖ్యలో పూజలను పలువురు భక్తాదులు చేసుకొంటున్నారు. భక్తులు కోరిన కోర్కెలు తీర్చుట వల్ల ఈ గుడికి అభయ ఆంజనేయస్వామిగా పేరు దక్కింది.

# పెంచిన పెట్రోలు డీజిల్ ధరలు తక్షణమే తగ్గించాలి

### మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్ర రెడ్డి



నిరసనలు తెలుపుతున్న వైసీపీ కార్యకర్తలు, ఎమ్మార్వో కు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

**వాల్మీకిపురం, మే 18 ప్రభాతవార్త:**
రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పెట్రో, డీజల్ ధరలు తక్షణమే తగ్గించాల్సిందేనని కోరుతూ పీలేరు నియోజకవర్గంలోని ఆరుమండలాల నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సోమవారం మదనపల్లె తిరుపతి జాతీయ రహదారిపై ధర్నాతో పాటు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేఖత వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో పెట్రోల్ , డీజల్ ధరలు పెంపుతో నిత్యవసర సరుకులు, విద్యుత్తు ఛార్జీలు, రవాణా ఖర్చులు పెరిగిపోయి సామాన్య మరియు మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ సమయంలో మళ్లీ ఇంధన ధరలు పెంపు ప్రజలపై మరింత భారంగా మారిందన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు పెట్రో, డీజల్ ధరలు తగ్గిస్తామని, ప్రజలపై భారం మోపబోమని మేనిఫెస్టోలో ప్రత్యేకంగా హామీ ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అంతకు మునుపు పెరిగిన పెట్రో డీజల్ ధరలు తక్షణమే తగ్గించాలంటూ స్థానిక బైపాస్ రోడ్డు నుంచి ర్యాలీగా వచ్చి స్థానిక గాంధీ సర్కిల్లో జాతీయరహదారిపై ధర్నా నిర్వహించిన నిరసనలు వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీలేరు నియోకజవర్గ వైకాపా సీనియర్ నాయకులు ఇక్బాల్‌అహ్మద్, నల్లారి తిమ్మారెడ్డి, రైల్వే చలపతి, జగన్మోహన్ రెడ్డి , మహిత, ఆనంద్, చక్రధర్, గజ్జలశీనురెడ్డి, కలీం, రవీంద్రారెడ్డి, కేశవరెడ్డి, శ్రీధర్ రాయల్, లక్ష్మీనారాయణరెడ్డి, మోహన్ రెడ్డి , రమేష్, సదాశివకుమార్, సతీష్ రెడ్డి , నాగరత్న, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడి పండించే రైతుకు భరోసాగా మామిడి మార్కెట్ : రాజు



ప్రసంగిస్తున్న మాదిరాజు వెంకట్రమణరాజు

**చౌడేపల్లి, మే 18 ప్రభాతవార్త**
కష్టపడి పండించే రైతులకు తోడుగా చౌడేపల్లిలో మామిడి మార్కెట్‌ను సరికొత్త హంగులతో రూపొందించారని నియోజకవర్గ తేదేపా నాయకుడు మాదిరాజు వెంకట్రమణరాజు అన్నారు. సోమవారం తిరుపతి మార్గంలోని హరిశ్చంద్రఘాట్‌కు సమీపంలో మామిడి మార్కెట్‌ను ఆయన ప్రారంభించారు. దశాబ్దాల తరబడి ఈ ప్రాంత రైతులు మామిడిని దామలచెరువు, చిత్తూరు, బంగారుపాళెం, బెంగళూరు, మదనపల్లి తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారన్నారు. ప్రయాణ, దినసరి ఖర్చులు, మండీలో కమీషన్ వంటివి రైతులకు భారంగా తయారయ్యేవన్నారు. అయితే నూతనంగా చౌడేపల్లిలో ఏర్పాటైన మామిడి మార్కెట్‌తో రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. బయట మార్కెట్లలో ఏ విధంగా అయితే ధరలుంటాయో అదే రకంగా వుంటాయన్నారు. ఉద్యానవన పంటల్లో రారాజుగా వున్న మామిడి పంటను రైతులు సుదూర ప్రాంతాలకు వెళ్ళి నష్టపోకుండా చౌడేపల్లిలో నూతనంగా ప్రారంభించిన మార్కెట్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రిటైర్డ్ జడ్జి నౌషాద్‌అలీ, సీనియర్ న్యాయవాది గంగయ్యనాయుడు, మార్కెట్ యాజమాన్యం నూర్‌భాషా, ఇస్మాయిల్, ఇర్ఫాన్, మాది రాజు రామకృష్ణమరాజు, ప్రవీణ్‌కుమార్‌రాజు, శ్రీరామ్ గోపి, రైతులు, పండ్ల వ్యాపారులు పాల్గొన్నారు.

# క్లస్టర్ల వారీగా డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేయండి

### ఎమ్మెల్యే కిశోర్ పిలుపు



**కలికిరి, మే 18, ప్రభాతవార్త:**
నా దేశం నా బాధ్యత అనే నినాదంతో తెదేపా అధ్యక్షులు చంద్రబాబునాయుడు తీసుకున్న నిర్ణయాల మేరకు మహానాడు కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త వీక్షించాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 27, 28 తేదీల్లో జరగాల్సిన మహానాడు కార్యక్రమం వాయిదా పడిన నేపథ్యంలో పార్టీ ఆదేశాల మేరకు పీలేరు నియోజకవర్గంలోని 10 క్లస్టర్ల పరిధిలోని ప్రతి మండల పార్టీ కార్యాలయంలో డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేసి ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించాలని టీడీపీ శ్రేణులకు నల్లారి అభిమానులకు, అనుబంధ సంఘాలకు సూచించారు. ఈ మేరకు సోమవారం నగిరిపల్లిలోని తన కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించి నాయకులకు దిశా నిర్దేశం చేశారు. రెండు రోజుల పాటు మండల కేంద్రాల్లో జరిగే వీక్షణ కార్యక్రమంలో తాను కూడా ప్రత్యక్షంగా పది క్లస్టర్లలో పాల్గొంటానని ఎమ్మెల్యే ప్రకటించారు. పార్టీ పిలుపును ప్రతి గడపకు తీసుకెళ్లాలి. వర్చువల్‌గా జరిగే మహానాడు కార్యక్రమంలో సీఎం చంద్రబాబునాయుడు, పార్టీ శ్రేణులు ఇచ్చే సందేశాన్ని ప్రతి కార్యకర్త వినాలని ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జిలు, సింగల్ విండో అధ్యక్షులు, మార్కెట్ యార్డు ఛైర్మన్లు, మండల, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు, అనుబంధ సంఘాలు నల్లారి అభిమానులు, నియోజకవర్గ వ్యాప్తంగా పెద్దఎత్తున చేరుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వడదెబ్బకు ఉపాధి హామీ కూలి అకాల మరణం

### ఆశ్రయం కోల్పోయిన కుటుంబం



**తంబళ్లపల్లె మే 18 ప్రభాతవార్త ః**
ఉపాధి హామీ పనులతో జీవనం సాగించే ఓ దళిత కూలి వడదెబ్బ తగిలి తీవ్ర అస్వస్థతకు గురై మృత్యువాత పడిన విషాదకర సంఘటన గోపి దిన్నె పంచాయతీలో వెలుగు చూసింది. మండలంలోని గోపి దిన్నే పంచాయితీ దళిత వాడకు చెందిన అలిగింటి శ్రీనివాసులు (45) నిరుపేద కుటుంబం. ఉపాధి హామీ కరువు పనులకు వెళ్లి తన భార్య గౌరమ్మతో పాటు ముగ్గురు సంతానాన్ని పోషిస్తున్నాడు. ప్రతిరోజు ఉపాధి పనికి వెళ్లే శ్రీనివాసులు సోమవారం సైతం ఉపాధి పనులకు వెళ్ళాడు. అక్కడ పనిచేస్తుండగా హఠాత్తుగా వడదెబ్బ తగిలి అపస్మార్క స్థితికి చేరుకున్నాడు. హుటాహుటిన సహచర కూలీలు సపర్యలు చేసి చికిత్సలకు తరలించడానికి ప్రయత్నించగా అప్పటికే శ్రీనివాసులు మృతి చెందాడు. కుటుంబాన్ని పోషించే పెద్దదిక్కు కోల్పోవడంతో భార్య, ముగ్గురు పిల్లలు ఇక మమ్మలను ఆదుకునే దిక్కెవరిని కన్నీరు మున్నీరుగా విలపించారు. శ్రీనివాసుల కాయ కష్టంతో జీవనం సాగించే ఆ కుటుంబం నేడు ఆశ్రయం కోల్పోయి బజారున పడిందని ఆ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని సర్వత్ర కోరుతున్నారు. శ్రీనివాసులు కరుడుగట్టిన తెలుగుదేశం పార్టీ సభ్యత్వంతో కార్యకర్త గా పనిచేస్తున్నాడు. శ్రీనివాసుల కుటుంబాన్ని పార్టీ పరంగా ఆదుకోవడానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు.

## కార్మికులను క్రమబద్ధీకరించాలని సిఐటియుచే కార్మికులు ధర్నా




ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

**మదనపల్లె, మే 18 ప్రభాతవార్త :**
మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలని సిఐటియు ఆధ్వర్యంలో ఏపి మున్సిపల్ వర్కర్స్ ధర్నా నిర్వహించారు. సిఐటియు రాష్ట్ర కమిటి పిలుపుమేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ పెడరేషన్ యూనియన్ సభ్యులు ధర్నా నిర్వహించారు. వీరికి మద్దతుగా ఏపి ఎలక్ట్రిసిటి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ మద్దతు ప్రకటిస్తూ జిల్లా అధ్యక్షులు నారాయణ ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్కసారిగా పెట్రోల్, డీజల్ ధరలు పెంచడం వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రామక్రిష్ణ మాట్లాడుతూ కార్మికులను క్రమబద్దీకరించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు రూ.26వేలు వేతనం ఇవ్వాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ప్రమీలకు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, శంకర్‌నాయక్, రామచంద్ర, గోపాల్, చిన్నరెడ్డప్ప, రాజు, రమేష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## విశేషంగా స్నాపనతిరుమంజన సేవ



**వాల్మీకిపురం, మే 18 ప్రభాతవార్త:**
తితిదే ఆధ్వర్యంలోని స్థానిక శ్రీ పాండురంగ విఠలేశ్వరస్వామి వారి ఆలయంలో సోమవారం శ్రీకృష్ణుడు జన్మ నక్షత్రమైన రోహిణినక్షత్రంను పురస్కరించుకుని విశేషపూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమై నిత్యసేవలు అనంతరం స్వామివారికి విశేషంగా స్నపన తిరుమంజన సేవ నిర్వహించారు. రోహిణి నక్షత్రంను పురస్కరించుకుని ఆలయంలో ఉదయం నుంచి విశేషపూజా కార్యక్రమాలను వేదపండితులు నిర్వహించారు తదుపరి సాయంత్రం విశేషాలంకరణలో ముస్తాబైన శ్రీ సత్యభామ, రుక్మిణి సమేత పాండురంగవిఠలేశ్వరస్వామివారు తిరుచ్చిని అధిరోహించి వాల్మీకిక్షేత్రంలోని నాలుగమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు స్వామివారికి కర్పూరం, కొబ్బరికాయ సమర్పించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తితిదే వేదపండితులు, తితిదే అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## ఊలపాడు గ్రామాన్ని సందర్శించిన ఎంపిడిఓ 1 అన్నపూర్ణ



**రామసముద్రం మే 18 ప్రభాతవార్త:**
రామసముద్రం మండలం ఊలపాడు గ్రామపంచాయతీని ఎంపిడిఓ 1 అన్నపూర్ణ సందర్శించారు, సోమవారం హరిజనవాడను పరిశీంచారు, గ్రామంలో సిమెంట్ రోడ్డు ఎత్తు కావడంతో వర్షపు నీరు, మురుగు నీరు తమ ఇళ్ల మధ్యన ఉండిపోయి దురువాసన కొడుతుందని గ్రామప్రజలు ఆమెకు తెలియజేసారు, ఆమె ప్రజలతో మాట్లాడుతూ వర్షపు నీరు ఇళ్ల మధ్యన నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటామని హరిజనవాడ ప్రజలకు తెలిపారు.మాజీ టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు కృష్ణం రాజు యాదవ్, పంచాయతీ అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

## మహిళా భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

**లక్కిరెడ్డిపల్లి మే 18 ప్రభాతవార్త**
మహిళా భద్రతపై ప్రతి ఒక్కరు ఆహ్వాన కలిగి ఉండాలని లక్కిరెడ్డిపల్లి ఎస్సై గోల్కొండ శోభ పేర్కొన్నారు సోమవారం మహిళల భద్రత గంజాయి కోడిపందాలు క్రికెట్ బెట్టింగ్లపై ఆటో ద్వారా పల్లె పల్లెలో ప్రతి గ్రామంలోనూ ప్రచార గారు ఇచ్చారు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మహిళను ఎవరైనా వేధిస్తే వారిపైన కడలిజనులు తప్పవని ఆమె హెచ్చరిక జారీ చేశారు గ్రామాలలో క్రికెట్ బెట్టింగ్ లు కోడి పందాలు గంజాయి విక్రయాలు వెంటనే పోలీసులకు తెలియజేయునన్నారు ఎవరైనా ఆకతాయిలు మహిళలను అసభ్యకరంగా వేధించడం అంటే జరిగితే ఎస్సై లేదా సిఐ లకు తెలియజేయాలి అన్నారు

# వైసీపీ నాయకులు జగన్‌పై పోరు బాట చేయాలి

- జగన్ హయాంలోనే ఏపీలో పొరుగు రాష్ట్రాల కంటే అధిక ధరలు
- ఐదేళ్ల పాలనలో రూ. 45 పెంచిన జగన్
- ప్రస్తుతం ధరలు పెంచింది రాష్ట్రం కాదు కేంద్రమే
- వ్యాట్‌తో ప్రజల జేబులు ఖాళీ చేసిన జగన్
- తూగుట్ల మధు సూదన్ రెడ్డి ఘాటు విమర్శలు


మాట్లాడుతున్న తూగుట్ల మధుసూదన్ రెడ్డి

**పులివెందుల, మే 18, ప్రభాతవార్త :**
రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలకు రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని, పశ్చిమ ఆసియాలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరగడంతో కేంద్ర ప్రభుత్వం ధరలను సవరించిందని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తూగుట్ల మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ధర్నాలు చేయాలనుకుంటే ముందుగా తమ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో జరిగిన ధరల పెంపుపై పోరాటం చేయాలని సూచిం చారు.జగన్ పాలనలో ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్ ధర లీటరుకు రూ.110 వరకు ఉంటే అదే సమయంలో పొరుగు రాష్ట్రాలైన కర్ణాటకలో రూ.103, తమిళనాడులో రూ.101 మాత్రమే ఉండేదని తెలిపారు. అలాగే డీజిల్ ధర కూడా ఆంధ్రప్రదేశ్‌లో లీటరుకు రూ.98 ఉండగా, కర్ణాటకలో రూ.91, తమిళనాడులో రూ.92 మాత్రమే ఉండేదన్నారు. పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు ఎక్కువగా ఉండటానికి కారణం రాష్ట్ర ప్రభుత్వం విధించిన అధిక వ్యాట్ పన్నులేనని ఆరోపించారు. లీటర్‌కు అదనంగా సుమారు రూ.4 వ్యాట్ విధించడంతో పాటు, ప్రత్యేక సెస్ రూపంలో మరో రూపాయి వసూలు చేయడం వల్ల ప్రజలపై భారం పడిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో 45 రూపాయలు పెంచడం జరిగింది అన్నారు. ప్రస్తుతం ధరల పెంపు బాధాకరమే అయినప్పటికీ, గతంలో ప్రజలపై అధిక భారం మోపిన వైసీపీ నేతలు ఇప్పుడు ధర్నాలు చేయడం సమంజసం కాదని, వారికి నైతిక హక్కు లేదని తూగుట్ల మధుసూదన్ రెడ్డి విమర్శించారు.

# నిత్యపూజకోనకు పోటెత్తిన భక్తులు



**సిద్ధవటం మే 18 ప్రభాతవార్త**
లంక మల అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీ నిత్య పూజకోనకు శివ భక్తులు పోటెత్తారు ఎండోమెంట్ సిబ్బంది భక్తులకు మెరుగైన వసతులు ఏర్పాటు చేశారు మండలంలోని వంతాటిపల్లి గ్రామం లంకమల అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీ నిత్య పూజేశ్వర కోనకు సోమవారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు పంచలింగాల గుడి వద్ద త్రాగునీటి గుండాలలో బ్లీచింగ్ పిచికారి చేసి భక్తులకు మెరుగైన త్రాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశారు పంచలింగాల గుడి వద్ద నుండి కాలినడకన నడుచుకుంటూ, కడప, ఒంటిమిట్ట, పోరుమామిళ్ల బద్వేల్ తదితర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఎండోమెంట్ శాఖ ఏర్పాటు చేసిన హుండీలలో భక్తులు కానుకలు సమర్పించారు ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యం శర్మ మాట్లాడుతూ స్వామివారికి గణపతి పూజ, రుద్రాభిషేకం పంచామృత అభిషేకాలతో విశేష పూజలు అందించామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ శాఖ సిబ్బంది చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి పనులను పరిశీలించిన ఎంపీడీవో

**దువ్వూరు, మే 18, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని వివిధ గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను సోమవారం ఎంపీడీవో సుబ్బారెడ్డి పరిశీలించారు. మండలంలోని పెద్ద జొన్నవరం గ్రామ పంచాయతీలో జరుగుతున్న పనులను పరిశీలించి అక్కడ కూలీలకు తగు సూచనలు సలహాలు అందజేశారు. ప్రతి రోజు 307 రూపాయలు కూలీ పడే విధంగా పనిచేయాలని, ఉదయం 6 గంటలనుండి 10 లోపలే ఉపాధి పనులకు రావాలని సూచించారు. వేసవిలో ఎండలు ఎక్కువగా ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి కూలికి 307 రూపాయలు కూలి పడే విధంగా చేయించాలని అక్కడ ఉన్న సిబ్బందికి తెలిపారు. ఆయన వెంట ఏపిఓ లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.




# చేతివృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి

**బద్వేలు అర్బన్, మే 18, ప్రభాతవార్త**
చేతివృత్తిదారుల సమస్యలను పరిష్కరించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చేతివృత్తిదారుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ బద్వేల్ ఏరియా సమితి ఆధ్వర్యంలో సోమవారం బద్వేల్ ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరశేఖర్ మాట్లాడుతూ, ఒకప్పుడు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పునాదిగా నిలిచిన చేతివృత్తులు నేడు ప్రభుత్వాల నిర్లక్ష్యంతో తీవ్ర సంక్షోభంలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థల ప్రభావంతో వృత్తిదారులు ఉపాధి కోల్పోయి వలస బాట పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్పొరేషన్లు నిధుల లేమితో అలంకారప్రాయంగా మారాయని, అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా మాత్రమే రుణాలు మంజూరు చేస్తున్నారని విమర్శించారు. ప్రతి చేతివృత్తిదారునికి ఆదరణ పథకం కింద రూ.5 లక్షల రుణాన్ని 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలని, 50 ఏళ్లు నిండిన వారికి పింఛన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వృత్తిదారుల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించాలని, వారి ఉత్పత్తుల విక్రయానికి ప్రత్యేక మార్కెట్లు ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు, వివిధ వృత్తిదారుల సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చేతి వృత్తిదారుల సంఘం నాయకులు

## భారతీయ భాషలపై ఆసక్తి పెంపొందించే

# భారతీయ భాషా సమ్మర్ క్యాంప్‌కు విద్యార్థుల నుంచి విశేష స్పందన






**కడప, మే 18 ప్రభాతవార్త :**
భారతీయ భాషలు, సంస్కృతి, వారసత్వ పరిరక్షణ లక్ష్యంగా నిర్వహిస్తున్న భారతీయ భాషా సమ్మర్ క్యాంప్–2026" కార్యక్రమం సోమవారం కడపలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో ఘనంగా ప్రారంభమైనట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీ మునీష్ మీనా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఒక భాష మరింత నేర్చుకుంటే ఒక హృదయం మరింత దగ్గరవుతుంది" అనే భావనతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక శిబిరంలో 3వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులు పాల్గొంటున్నారని చెప్పారు. ఈ నెల 18 నుంచి 24 వరకు జరిగే ఈ క్యాంప్‌లో మలయాళ భాషను విద్యార్థులకు సరదాగా, సృజనాత్మకంగా బోధిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతిరోజూ అభివాదాలు, సంభాషణలు, సంగీతం, నృత్యం, సాంస్కృతిక కార్యక్రమాలు, స్థానిక వంటకాల పరిచయం, చరిత్ర–భూగోళ శాస్త్ర అంశాలు వంటి విభిన్న కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి రోజు కార్యక్రమంలో మొత్తం 30 మంది విద్యార్థులు పాల్గొని విశేష ఆసక్తి కనబరిచారు. విద్యార్థులకు మలయాళ భాషలో ప్రాథమిక అభివాదాలు, అక్షరాలు, సంఖ్యలు, సాధారణ పదాలను పరిచయం చేశారు. "నమస్కారం", "ధన్యవాదాలు" వంటి పదాలను మలయాళంలో పలకడం ఉపాధ్యాయులు నేర్పించారు. ఆటలు, సరదా కార్యకలాపాల ద్వారా నిర్వహించిన బోధనలో విద్యార్థులు చురుకుగా పాల్గొని కొత్త భాష నేర్చుకోవడంలో ఆనందాన్ని వ్యక్తం చేశారు. భాషల అధ్యయనం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సంభాషణ నైపుణ్యాలు, సృజనాత్మకత పెంపొందడంతో పాటు "ఏక్ భారత్–శ్రేష్ఠ భారత్" భావన మరింత బలపడుతుందని ప్రిన్సిపాల్ అన్నారు. వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఈ శిబిరంలో చురుకుగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

## వాహన దారులు ప్రతి ఒక్కరూ

# హెల్మెట్ ధరించి వాహనం నడపాలి



**వేంపల్లె మే 18 ప్రభాతవార్త**
వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనం నడపాలని ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. సోమవారం పట్టణంలోని పులివెందుల రోడ్డు లోని గంటన్న బట్టీల సమీపంలో వాహనాలు తనిఖీ నిర్వహించారు. లైసెన్స్, ఇన్సూరెన్స్, హెల్మెట్ లేని వారికి జరిమానాలు విధించారు. అనంతరం ఎస్ఐ తిరుపాల్ నాయక్ వాహనదారులకు పలు సూచనలు చేశారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలని అన్నారు. వాహనాల రికార్డులు తప్పనిసరిగా ఉంచుకోవాలని అన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం, మైనర్ లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమన్నారు. అలాగే సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమన్నారు. వీటి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఇంటి నుంచి బయటకు వచ్చే సందర్భాల్లో వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది శ్రీనాథ్ రెడ్డి, బాబా ఫక్రుద్దీన్, డ్రైవర్ డాక్టర్ ఆనంద్ పాల్గొన్నారు.

# యువతలో క్రీడా స్ఫూర్తి పెంపు



**నందలూరు, మే 18 ప్రభాతవార్త :**
క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని సింగిల్ విండో అధ్యక్షులు పసుపులేటి ప్రవీణ్ కుమార్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, టీడీపీ మండల క్లస్టర్ ఇంచార్జ్ చుక్క యానాది పేర్కొన్నారు. నాగిరెడ్డిపల్లి గ్రామంలో ఎర్రచెరువు శ్రీ మారమ్మ తల్లి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ సోమవారం ఉత్కంఠభరితంగా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడంలో ఇలాంటి టోర్నమెంట్లు కీలకమని తెలిపారు. అనంతరం విజేతగా నిలిచిన కాశీ లెవన్స్ జట్టుకు, రన్నరప్‌గా నిలిచిన వినాయక లెవన్స్ జట్టుకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యువత, క్రీడాభిమానులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెట్రోల్ డీజిల్ పెరుగుదలపై వైఎస్ఆర్సిపి నిరసన



**మైదుకూరు, మే 18, ప్రభాతవార్త:**
పెట్రోల్, డీజిల్ పెరుగుదలపై వైఎస్ఆర్సిపి రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా మైదుకూరు పట్టణంలో వైఎస్ఆర్సిపి మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామి రెడ్డి కడప రోడ్డు స్థానిక మండల పరిషత్తు కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. కార్యక్రమంలో వైయస్సార్సీపి మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చంద్రబాబు ప్రజలను మభ్యపెట్టే అధికారంలో వచ్చి ఒక్క హామీని కూడా నిలబెట్టు కోలేదని లోకేష్ పాదయాత్రలో కూడా పెట్రోల్ ధరలు తగ్గిస్తామని చెప్పారని ఇప్పుడేమో అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్రోల్ డీజిల్ పై రేట్లు పెంచేశారని నిరసనలో తెలియజేశారు. రాష్ట్రంలో అభివృద్ధి ఎక్కడ జరగడం లేదని బడ్జెట్లో రాయలసీమకి ఎంత ఖర్చు పెట్టారో లెక్కలు చెప్పే ధైర్యం మీకు ఉందా అని నిలదీశారు. రైతన్న పరిస్థితి గిట్టుబాటు ధర లేక ఇబ్బందుల్లో ఉంటే పెట్రోలు డీజిల్ ధరలు పెంచితే అన్ని వ్యవసాయ ఖర్చులు పెరుగుతాయని ఎరువుల ధరలు పెంచి ఎరువులు కూడా అందుబాటులో లేకుండా చేస్తూ యూరియా వాడితే క్యాన్సర్ అంటూ మభ్యపెడుతున్నారని ప్రజలు బాగా తెలుసుకున్నారని రాష్ట్రంలో ఎన్నికలు జరిపితే ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో వెంటనే డీజిల్ పెట్రోల్ రేట్లు తగ్గించాలని నిరసనలో డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు లింగన్న, సుబ్బరాయుడు, మూలే. భరత్ కుమార్ రెడ్డి, కిరణ్మయి, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అధిక మార్కులు సాధించిన

# విద్యార్థులకు అభినందనలు



**పెండ్లిమర్రి, మే 18, ప్రభాతవార్త:**
పెండ్లిమర్రి మండలం నందు మండలం కడప డివిజన్, కమలాపురం నియోజకవర్గం స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన శ్రీనిత్య, శిజ్యోతి, హుసేన్‌బీలతో పాటు 500 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులను విద్యాశాఖాధికారులు అభినందించారు. మన ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి నాణ్యమైన విద్య పొందండి అనే నినాదంతో మండల విద్యాశాఖ తరుపున ఫ్లెక్సీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యాశాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నారైల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

## టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు


ఏపీ ఎన్నార్టీఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జగన్మోహన్రాజు

**రాజంపేట, మే 18 ప్రభాతవార్త**
ఎన్నారైల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ ముందుంటాన ని సమస్యలు తన దృష్టికి ఎప్పుడు తీసుకొచ్చినా పరిష్కరించేందుకు అంకితభావంతో పనిచేస్తానని టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు అన్నారు. సోమవారం ఎంజిపురం ఇందిరమ్మ కాలనీలో ఏపీ ఎన్నార్టీఎస్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎన్నారై లతోపాటు స్థానిక నేతలు జగన్ కు ఘనస్వాగతం పలికారు. ఎం జి పురం కు చెందిన ఎన్నారై టిడిపి నేత కుర్రా రమణ యాదవ్, కుర్రా శివ ఆధ్వర్యంలో చమర్తిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ సంఘం డైరెక్టర్ ప్రతాప్ రాజు, చైర్మన్ గన్నె సుబ్బనరసయ్య నాయుడు, వైస్ చైర్మన్ రాయుడు, జెడ్పిటిసి ముద్దుకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మోహన్ రెడ్డి, మండల అధ్యక్షులు రవికుమార్ నాయుడు, సింగల్ విండో చైర్మన్ దశరధ నాయుడు, యూనిట్ ఇన్చార్జ్ రుద్రరాజు జనార్ధన్ రాజు, బూత్ కన్వీనర్ గూడూరు శివ, భూత్ ఇంచార్జ్ కోటపాటి సుబ్బరాయుడు, రేవూరి శివరామకృష్ణయ్య, బూత్ ఇంచార్జ్ డివిఎస్ రాజు, జగదాబి రాజేంద్రప్రసాద్, వంశి, భోగా మురళీ, కాలువ సుధాకర్ నీలం అంకమ్మ నాయకులు, పార్టీ శ్రేణులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలి






**బద్వేల్ అర్బన్ మే 18 ప్రభాతవార్త**
వైఎస్సార్సీపీ అధ్యక్షుడు శ్రీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారి ఆదేశాల మేరకు, సోమవారం పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని కోరుతూ బద్వేల్ ఆర్డీఓ కు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ వినతిపత్రం సమర్పించడం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ రోజు దేశంలో ఎక్కడా లేని విధంగా ఒక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే పెట్రోల్, డీజిల్ అధిక ధరలకు విక్రయించడం జరుగుతోందని తెలిపారు. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు పెరిగి అల్లాడుతున్న ప్రజలపై, ఈ పెంపు మరింత పెనుభారంగా మారబోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గిస్తామని చెప్పి, ఈ రోజు ధరలను పెంచి ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. ఈ ధరల పెంపు వల్ల రైతాంగంపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, ఇంధన ధరల పెంపు వల్ల రవాణా ఖర్చులు పెరిగి, మార్కెట్‌లో ప్రతి ఒక్క వస్తువు ధర పెరుగుతుందని చెప్పారు. దీనివల్ల పేద, సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు తీవ్రంగా నష్టపోతాయని పేర్కొన్నారు. కావున, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని, లేనిపక్షంలో ప్రజల పక్షాన వైఎస్సార్సీపీ పెద్ద ఎత్తున పోరాడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్ రెడ్డి, జెడ్పిటిసి పోలిరెడ్డి, చాపాటి సాయి నారాయణ రెడ్డి, నాగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, బిజి వేముల రామసుబ్బారెడ్డి, గానుగపెంట రమేష్ బాబు, పంగా చెన్న కృష్ణారెడ్డి, 11 వార్డ్ వేముల సుబ్బరాజ, గాజులపల్లె కేశవరెడ్డి, గుర్రంపాటి రమణారెడ్డి, కృష్ణారెడ్డి రవీంద్రారెడ్డి, తుమ్మిశెట్టి సునీల్, వంకెల జయరామి రెడ్డి, పుత్త శ్రీరాములు, మాజీ కౌన్సిలర్ చెన్నయ్య, పూనిపర్తి ఉమా, బిజ్జం రమణ సరిటాల మోలాలి మాధవరెడ్డి కేశవులు మరియు వైఎస్సార్సీపీ నియోజకవర్గ ముఖ్య, సీనియర్ నాయకులు, పార్టీ తరపున వివిధ హోదాలలో ఉన్న నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

## - రాష్ట్ర అధ్యక్షులు అందెల బాల ఓబయ్య

**పెండ్లిమర్రి, మే 18, ప్రభాతవార్త:**
పాస్టర్ అభినయపై దాడి పిరికిపంద చర్య అని బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అందెల బాల ఓబయ్య, మహిళా అధ్యక్షురాలు బి.విజయ, ప్రేమ్‌కుమార్, అనివేల కర్ణ సాగర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక పేదల అభివృద్ధి కోరుతూ పాదయాత్ర చేస్తున్న పాస్టర్ అభినయపై కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నిందితులను త్వరగా అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా బహుజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు.



## మహిళా భద్రతపై ప్రతి ఒక్కరూ

# అవగాహన కలిగి ఉండాలి

**లక్కిరెడ్డిపల్లి మే 18 ప్రభాతవార్త**
మహిళా భద్రతపై ప్రతి ఒక్కరు ఆహ్వాన కలిగి ఉండాలని లక్కిరెడ్డిపల్లి ఎస్సై గోల్కొండ శోభ పేర్కొన్నారు సోమవారం మహిళల భద్రత గంజాయి కోడిపందాలు క్రికెట్ బెట్టింగ్లపై ఆటో ద్వారా పల్లె పల్లెలో ప్రతి గ్రామంలోనూ ప్రచార గారు ఇచ్చారు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మహిళను ఎవరైనా వేధిస్తే వారిపైన కడలిజనులు తప్పవని ఆమె హెచ్చరిక జారీ చేశారు గ్రామాలలో క్రికెట్ బెట్టింగ్ లు కోడి పందాలు గంజాయి విక్రయాలు వెంటనే పోలీసులకు తెలియజేయునన్నారు ఎవరైనా ఆకతాయిలు మహిళలను అసభ్యకరంగా వేధించడం అంటే జరిగితే ఎస్సై లేదా సిఐ లకు తెలియజేయాలి అన్నారు.

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో ప్రజలపై 3,391 కోట్ల భారం



పెరిగిన పెట్రోల్ ధరలకు నిరసనగా ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నేతలు

**రాజంపేట, మే 18 ప్రభాతవార్త**
రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ ధరలు దేశంలోనే అత్యధిక స్థాయికి చేరుకోవడం ప్రజలపై తీవ్రమైన ఆర్థిక భారం మోపుతోందని, ఎన్నికల ముందు పెట్రో ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక మాట తప్పి ప్రజలను మోసం చేస్తున్నారని రాజంపేట ఎమ్మెల్యే అమర్నారెడ్డి విమర్శించారు. పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలకు నిరసనగా వైసిపి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి సబ్ కార్యాలయంఏవో కు పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకపోవాలని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి, పార్టీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే పెట్రోల్, డీజిల్‌పై భారం తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ ఆకేపాటి అనిల్ కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చొప్ప యల్లారెడ్డి, అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి, వడ్డే రమణ, నడివిడి సుధాకర్, భాస్కర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.